ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్!

- డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య
- డబ్బులు పోగొట్టుకున్న వైనం
- తల్లిదండ్రుల మందలింపు
- కోనేరులో పడి మృతి

కోనేరులో పడి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి శ్రీనివాసులు ..ఇన్‌సెట్‌లో (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -పుంగనూరు: డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థి ఆన్‌లైన్ బెట్టింగ్ గేములకు అలవాటు పడి బాగా డబ్బులు పోగొట్టుకున్నాడు. దీన్ని గమనించిన అతని తల్లి దండ్రు లు మందలించి సెల్ ఫోన్‌ను లాక్కోవడంతో నిరాశ చెందిన విద్యార్థి కోనేరులో పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుంగనూరులో పట్టణం లో చోటుచేసుకుంది. పుంగనూరు పట్టణంలో వుంటున్న రెడ్డప్ప కుమారుడు శ్రీనివాసులు డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. శ్రీనివాసులు ఆన్‌లైన్ గేమ్‌లు అడుకుంటూ బాగా డబ్బులు పోగొట్టేవాడు. దీన్ని గమనించి ఇంట్లో తల్లిదండ్రులు మందలించి మంగళ వారం రాత్రి తన వద్ద ఉన్న సెల్ ఫోన్ లాక్కోవ డంతో ఆ బాధను తట్టుకోలేక రాత్రి కోనేరు సమీపం లో పైన చెప్పులు వదిలేసి మెట్లపై కూర్చున్నా డు. ఇది గమనించిన కొంత మంది 'ఇక్కడ నుండి వెళ్లిపో' అని వారించారు. ఇది విని శ్రీనివాసులు వెళ్లినట్టు వెళ్లి మళ్లీ అక్కడికి వచ్చి అదృశ్య మయ్యాడు. మెట్లపై చెప్పులను చూసిన కొంతమంది తల్లిదండ్రులకు చెప్పడంతో వాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపులో శ్రీనివాసులు మృతదేహమై బయట పడ్డాడు. పట్టణ పరిసరాల నుండి వందలాది మంది ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని చూసి కన్నీరు మున్నీ రయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

డ్వాక్రా మహిళలే వంటమ్మలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఇంటర్ విద్యార్థులకు ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజనం పథకానికి డ్వాక్రా మహిళలే వంటమ్మలుగా వ్యవహరించనున్నారు. దీంతో వారికి ఉపాధి లభించనుంది.

జిల్లాలో 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి. వీటిల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 3,400 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరంలో 3,501 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఎక్కువమంది బడుగు , బలహీన వర్గాలకు చెందినవారు వున్నారు. దళిత కుటుంబ విద్యార్థులే ఎక్కువగా ఉంటారు. వీరిలో మధ్యాహ్న భోజనం తీసుకొచ్చే పరిస్థితి కూడా ఉండదు. వీరి తల్లిదండ్రులు ఉదయాన్నే లేచి కూలీ పనులకు వెళుతుంటారు. మధ్యాహ్నానికి విద్యార్థులకు అవసరమైన భోజనాన్ని తయారుచేసి ఇచ్చే పరిస్థితి ఉండదు. మధ్యాహ్నం పస్తులతో కాలే కడుపుతోనే కళాశాలకు వచ్చి సాయంకాలం ఇంటికి చేరుకునేంతవరకు వస్తువులు ఉండాల్సిన పరిస్థితి.

జిల్లా మొత్తం మీద వివిధ జూనియర్ కళాశాలల్లో ఈ సమస్య ఉంది. పేద, దిగువ మధ్యతరగతి విద్యార్థులకు ఇదే సమస్య.

. టీడీపీ ప్రభుత్వం 2013లో టిడిపి ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసింది. జగన్ సర్కార్ వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన పథకాన్ని సర్కార్ నిలుపుదల చేసింది. ఈ పథకాన్ని పాఠశాల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేసింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి నేతృత్వంలో అక్షయపాత్ర నిర్వాహకులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లు, డి వైఈఓ , మండల విద్యాశాఖ అధికారులతో వారం రోజుల క్రితం సమావేశం నిర్వహించి మధ్యాహ్న భోజన పథకం అమలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నానాటికీ పడిపోతున్న విద్యార్థుల సంఖ్యను పునరుద్ధరించడానికి ఈ పథకం దోహదం చేస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు , అధ్యాపకులు భావిస్తున్నారు. మధ్యాహ్నం భోజన వసతి కల్పించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. విద్యార్థుల సంఖ్య, వంట పాత్రలు, ప్లేట్లు నిర్వాహకులు సరకులు పంపిణీ వివరాలను సేకరిస్తున్నారు .

ప్రభుత్వ కళాశాలకు దగ్గరగా ఉన్న ఉన్నత పాఠశాల నుంచి ఆహారాన్ని తయారుచేసి సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు జిల్లా విద్యాశాఖ డివైఈవో, ఎంఈఓ లతో సమావేశం నిర్వహించి సాధ్యాసాధ్యాలపై అభిప్రాయాలను తీసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న వంటమ్మల వద్ద భోజనం తయారు

చేయించి సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే బిల్లులు, గౌరవ వేతనం అందక అల్లాడుతున్న వంటమ్మలకు సకాలంలో జీతాలు చెల్లించడంతోపాటు, పెండింగ్ బిల్లులను చెల్లించి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం వంటమ్మలకు అప్పగించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ట్రేడ్ యూనియన్ నేతలు కోరుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు.

సురేష్‌ను బెదిరించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: బియ్యం అక్రమ రవాణాపై ప్రశ్నించిన సురేష్ ను అభినందించాల్సింది పోయి అతనిని బెదిరించడం ఏమిటని రాళ్లబుదుగురు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్యాయాన్ని ప్రశ్నించిన యువకుడు సురేష్‌ను అభినందించడం పోయి 'అక్రమ బియ్యం వాహనాన్ని సమాచారం ఇవ్వడం నేరమా?' అన్నట్లు అతడిని బెదిరించడం దారుణం అన్నారు. అక్రమంగా రవాణా సాగిస్తున్న వారితో ఎస్ఐకి సంబంధాలు ఉన్నాయన్న అనుమానం కలిగిస్తోందన్నారు. ఇలాంటి పోలీస్ అధికారుల వల్ల ప్రజల్లో వ్యతిరేకత భావం వస్తుందని తెలిపారు. ప్రజలకు, పేదలకు రక్షణ ఇవ్వాల్సిన పోలీసులు ఇలా ప్రవర్తించడం సరైన విషయం కాదన్నారు. కుప్పం డిఎస్పీ వెంటనే స్పందించి రాళ్ళ బుదుగురు ఎస్ఐపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చూడాలన్నారు.

రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రోడ్ల దుస్థితి

రోడ్లన్నీ గుంతలమయం

ఆదాయం లేదని వంకలు

పారిశ్రామిక వాడ..

కేరాఫ్ గుంతల జాడ..

సంక్రాంతికి ఎక్కడెక్కడో ఉండే బంధుమిత్రులంతా సొంతూళ్లకు వెళుతుంటారు.. ఎక్కడా కూడా గుంత ఉంది, ప్రయాణం ఇబ్బంది అయింది అనే కంప్లైంట్‌రాకూడదు.. సంక్రాంతి లోపు గుంతలన్నీ పూడ్చాలి.. స్థానిక ఎంఎల్‌ఎలదే ఈ బాధ్యత. అని స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుని తాజా హుకుం ఇది.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రేణిగుంట పారిశ్రామికవాడ.. కేరాఫ్ గుంతల జాడగా మారింది.. ఏ రోడ్డు చూసినా గుంతలమయం.. పరిశ్రమలు ఉండడంతో భారీ వాహనాలే ఈ రోడ్లపైకి వస్తుంటాయి. అయితే గుంతలమయమైన రోడ్లలో ఈ వాహన రాకపోకలు ప్రమాదకరంగా మారాయి.. వర్షం వచ్చిందంటే రోడ్లు వంకలను తలపిస్తున్నాయి. ఎపిఐఐసి అధికారులను ఈ విషయమూ వివరణ కోరగా ఆదాయం లేని కారణంగా ఏమీ చేయలేకపోతున్నామని చెప్పడం గమనార్హం.

రేణిగుంట పారిశ్రామికవాడలో 130 పరిశ్రమలు ఉన్నాయి. దాదాపు పది రహదారులు, 18 సందులు ఉన్నాయి. ఒకప్పట్లో పారిశ్రామికవాడ తారురోడ్లతో కళకళలాడేది. ప్రస్తుతం కళావిహీనంగా మారింది. రోడ్లన్నీ గుంతలు, కంకర తేలి వర్షపునీరు నిలిచిపోయి వాహన చోదకులకు, పాదచారులకు ఇబ్బందిగా ఉంది. ఏ గుంత ఎక్కడ ఉందో తెలియక పిల్లలు, వృద్ధులు పడిపోయి దెబ్బలు తినేపరిస్థితి. యర్రమరెడ్డిపాలెం వెళ్లే గ్రామస్తులైతే గ్రామానికి వెళ్లాలంటే పల్టీలు కొడుతూ వెళ్లాల్సిందే. ఇదే తనువుగా వర్షం వస్తే పరిశ్రమల వ్యర్థాలు రోడ్లపైకి రావడంతో జబ్బులు వచ్చే ప్రమాదం లేకపోలేదు. తిరుచానూరు స్టేషన్‌కు ఎదురుగా ఉన్న రహదారిలో అయితే పందులు స్వైరవిహారం చేస్తూ, బురదలో పొర్లుతూ ఉంటాయి. మొత్తం 130 పరిశ్రమల నుంచి కేవలం 20 లక్షల రూపాయలే ఆదాయం వస్తోందని, అందువల్ల రోడ్లు నిర్మించలేకపోతున్నామని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అధికారి 'ప్రజాశక్తి'కి వివరణ ఇవ్వడం గమనార్హం.

శాంతి స్వరూపుడు ఏసుక్రీస్తు

చిత్తూరు అర్బన్: క్రిస్మస్ వేడుకల్లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు. బుధవారం నగరం లోని స్థానిక దుర్గా నగర్ కాలనీలోని 20వ డివిజన్ కార్పొరేటర్ అశోక్ కుమార్ నివాసంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలోని ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి ప్రేమ దయ కరుణ భావాలు కలిగిన ఏసుక్రీస్తు కృపకు అందరూ పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ వెంకటిల, కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, మాజీ కార్పొరేటర్ వసంత కుమార్ ఇతర టిడిపి నాయకులు పాల్గొన్నారు. గుడిపాల మండలంలో క్రిస్టియన్ మైనార్టీ నాయకులు పీటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొని క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

ఎండిన బోరు నుంచి నీరు ఉబికి వస్తున్న దృశ్యం

వర్షాలతో జలకళ

ఎండిపోయిన బోరు నుంచి ఉప్పొంగిన నీరు

ప్రజాశక్తి- రొంపిచర్ల: ఇటీవల కురిసిన వర్షాలకు రొంపిచర్ల మండలానికి జలకళ లభించింది. బండ కింద పల్లి గ్రామం ముట్లోళ్ల పల్లి వద్ద పొలాల్లో గతంలో నీరు లేక ఎండిపోయిన బోరుబావి నుంచి నీరు ఉప్పొంగింది. ఈ మధ్య కురిసిన వర్షాలకు బోరు నుంచి నీరు పొంగి పొర్లుతు న్నాయి. జలకళ సంతరించుకో వడంతో స్థానిక రైతుల్లో ఆనందం నెలకొంది.

రేపు విద్యుత్ ఛార్జీల బాదుడుపై నిరసన

విజయవంతం చేయాలని వైసిపి పిలుపు

ప్రజా శక్తి - సదుం : విద్యుత్ ఛార్జీలు బాదుడుపై వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు పుంగనూరు పట్టణం లోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుండి స్థానిక విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం వరకు వైసిపి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ వెంకట మిథున్ రెడ్డి, వైసిపి ప్రధాన కార్యదర్శి పి పెద్దిరెడ్డి ర్యాలీ నిర్వహిస్తున్న సందర్భంగా మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పుంగనూరు పట్టణానికి తరలి రావాలని సదుం మండల వైసిపి కన్వీనర్ చింతల రెడ్డెప్ప రెడ్డి బుధవారం పేర్కొన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ వెంకట మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

7న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి - తిరుమల తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో 2025 జనవరి 10 నుండి 19వ తేదీ వరకు పది రోజుల వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలను పురస్కరించుకుని జనవరి 7వతేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జనవరి 7న ఉదయం 6 నుండి 10 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో 6వ తేది సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని దష్టిలో ఉంచుకుని టీటీడీకి సహకరించాల్సిందిగా భక్తులకు విజ్ఞప్తి చేశారు.

హెల్మెట్ ప్రాణ రక్షక కవచం: డిఎస్‌పి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: హెల్మెట్ మన ప్రాణాలను రక్షించే కవచమని, ప్రతి ఒక్కరూ ప్రయాణంలో హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని చిత్తూరు సబ్ డివిజన్ డిఎస్పీ సాయినాథ్ అన్నారు. ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోకుండా చిత్తూరు జిల్లా పోలీసు యంత్రాంగం తరచుగా రోడ్డు ప్రమాదల నివారణకు ప్రత్యేక కార్యచరణాలు, సమావేశాలు నిర్వహిస్తూ జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 500 మంది విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు సబ్ డివిజన్ డిఎస్పీ టి సాయినాథ్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించటం ద్వారా రోడ్డు ప్రమాదాల నుండి ఎలా రక్షించుకోవచ్చో వివరిస్తూ కొన్ని రోజుల క్రితం జరిగిన ఒక యాక్సిడెంటులో ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవటం చాలా బాధాకరం అని తెలిపారు. హెల్మెట్ ధరించడం వల్ల తల గాయాలు ,ప్రాణ నష్టాలను తీవ్రంగా తగ్గించవచ్చని వివరించారు. రోడ్లపై నిత్యం జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు భద్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, ముఖ్యంగా ద్విచక్ర వాహనాల పై మరణాలు, గాయాలు, రోజు రోజుకూ పెరుగుతూ సమస్యగా మారుతోందని ఈ పరిస్థితుల నుండి తప్పించుకోవడానికి హెల్మెట్లు ధరించడం అత్యంత ముఖ్యం అన్నారు. హెల్మెట్‌లు ద్విచక్ర వాహనదారులకు అత్యవసర రక్షణ పరికరాలు మాత్రమే కాదని, అవి రోడ్డు ప్రమాదాలలో ప్రాణ రక్షణగా నిలుస్తాయన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పలమనేరు విద్యార్థినికి ఐఎన్ఐ సెట్‌లో 38వ ర్యాంకు

పజాశక్తి -పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన డాక్టర్ బి హర్షితకు ప్రతిష్టాత్మక ఆల్ ఇండియా ఎయిమ్స్ పీజీ (ఐఎన్ఐ సెట్) ఎంట్రెన్స్ టెస్ట్ లో 99. 935 పర్సంటైల్‌తో 38వ ర్యాంకు సాధించింది. పలమనేరుకు చెందిన హర్షిత పలమనేరు పట్టణంలో వుంటున్న డాక్టర్ కె సావిత్రి, డాక్టర్ బి. సుబ్రహ్మణ్యం రెండవ కుమార్తె. డాక్టర్ బి హర్షితకు ప్రతిష్టాత్మక ఆల్ ఇండియా ఎయిమ్స్ పీ.జీ. (ఐఎన్ఐ సెట్) ఎంట్రెన్స్ టెస్ట్ లో 99. 935 పర్సంటైల్ తో 38వ ర్యాంకు సాధించారు. గత నెల 10 వ తేదీన ఎయిమ్స్ పీ.జీ. (ఐఎన్ఐ సెట్) ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించారు. గత నెల 16వ తేదీన వచ్చిన ఫలితాల్లో డాక్టర్ బి హర్షిత ఉత్తమ ర్యాంకు సాధించింది. పిజిఐ ఎంఇఆర్ చండీగర్ లో జనరల్ మెడిసిన్ సీటు సాధించారు. డాక్టర్ బి.హర్షిత ఎంబిబిఎస్ డిగ్రీ ఇటీవల కర్నూలు మెడికల్ కాలేజీలో పూర్తి చేశారు. తల్లిదండ్రులు తమ కుమార్తె విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హర్షిత అక్క బావ కూడా డాక్టర్లే కావడం గమనార్హం.

దళారుల అడ్డాగా ముక్కంటి క్షేత్రం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తీశ్వరాలయం దళారీ వ్యవస్థకు రహదారిగా మారింది. అధికారం మారినా.. అధికారులు మారినా ఆలయంలో దళారీ వ్యవస్థకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. దీంతో పలుకుబడి కలిగిన దళారీలు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. గతంలో ఆలయ నాలుగో గేటు నుంచి ఈవో కార్యాలయానికి సమీపంలోని ఆర్చి ద్వారా వీఐపీ వాహనాల రాకపోకలకు మాత్రమే అనుమతి ఉండేది. అయితే నేడు వాహనాల అనుమతి దళారుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. వారి పేరు చెప్తే భద్రతా సిబ్బంది వాహనాలను లోనికి అనుమతించాల్సిందే. లేకుంటే వారికి ఇబ్బందులు తప్పవు. పీఆర్ఓ కార్యాలయం కేంద్రంగా దళారులు చక్రం తిప్పుతున్నారు. అధికారులు మారిన సందర్భంగా విధానాలు కూడా మారుతున్నాయి. వీటిని ఆసరా చేసుకుని దళారులు రెచ్చిపోతున్నారు. చంద్రశేఖర్ ఆజాద్ ఇన్చార్జి ఈవోగా ఉన్న సమయంలో వాహనాలను పరిమితం చేశారు. ద్వి చక్ర వాహనాలను పూర్తిగా నిషేధించారు. దేవస్థానం, అధికారులు సిబ్బంది కూడా ద్విచక్ర వాహనాల్లో రాకూడదని ఆంక్షలు విధించారు. ఆలయ అధికారులు, ప్రముఖుల కార్లను మాత్రమే అనుమతించారు. ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. అన్ని రకాల వాహనాలు ఈవో కార్యాలయం వరకు వచ్చి వెళుతున్నాయి. వీరిని ఆపడం ఎవరివల్ల కావడం లేదు. భద్రతా సిబ్బంది ఆపితే బెదిరింపులు వస్తున్నాయి. దీంతో వారు తమకు ఎందుకులే అని అన్ని వాహనాలను లోనికి పంపిస్తున్నారు. రేకుల షెడ్డులో వాహనాలను ఇష్టం వచ్చిన విధంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. భక్తులకు ప్రమాదాలు కూడా జరిగాయి. ప్రమాదాలు జరిగిన రెండు రోజులు అధికారులు హడావుడి చేస్తారు. ఆ తర్వాత సాధారణ స్థితి. వాహనాల రాకపోకలపై నియంత్రణ లేదు. జ్ఞాన ప్రసూనాంబ వసతి గహానికి వెళ్లే భక్తులు, ప్రముఖుల వాహనాలను బూడిదమిట్ట గేటు ద్వారా అనుమతిస్తే ఇబ్బందులు తప్పుతాయని భక్తులు అంటున్నారు. దేవస్థానం అధికారులకు, వీవీఐపీలకు మాత్రమే సన్నిధివీధి ఆర్చి ద్వారా అనుమతిస్తే భక్తులకు ఇబ్బందులుండవు. అంతేగాకుండా ద్విచక్ర వాహనాలను పూర్తిగా నిషేధించాలి. పిఆర్ఓ కార్యాలయం కేంద్రంగా చేసుకున్న కొందరు దళారులు వాహనాలను లోపలికి తీసుకెళ్లడానికి సిబ్బందిపై దౌర్జన్యం చేస్తున్నారు. కూటమి పార్టీల నాయకుల పేర్లు చెప్పి వాహనాలను పంపాలని సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. వాహనాలను పంపకుంటే ఫలానా నాయకుడికి చెబుతామంటూ బెదిరిస్తున్నారు. దీనిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

వృథాగా తాగునీరు!

- రోడ్డుపైనే ప్రవాహం
- ఎస్‌సి హాస్టల్‌లోకి ప్రవేశిస్తున్న నీరు
- విద్యార్థులకు ఇబ్బందులు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: పంచాయతీ తాగునీటి సంపు నుండి నీరు వృథాగా వెలుతూ రోడ్డుపై ప్రవహించి బురదమయంగా మారుతోంది. అదే నీరు సమీపంలోని ఎస్‌సి హాస్టల్ ప్రధాన ద్వారం మీదుగా లోపలికి ప్రవహిస్తుండడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించకపోవడంతో ఈ సమస్య తీవ్రంగా మారి పాదచారులు, విద్యార్థులకు తీవ్ర తలనొప్పిగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. వ్రంగనారం రోడ్డులోని గొర్ల సంత వీధి నుండి సుమారు 300 మీటర్లు దూరంలో ఉన్న ఎస్సీ హాస్టల్ వద్దకు ఆర్ఎంపి సుబ్రహ్మణ్యం ఇంటి ఇంటి వద్ద వున్న వాటర్ సంపు ఓవర్ ఫుల్ అయి వారి ఇంటి వద్ద నుండి పుంగునూరు రోడ్డు మీదుగా ప్రవహిస్తూ ఎస్‌సి హాస్టల్ గేటు ద్వారా ప్రవహించి హాస్టల్ ఆవరణలోకి వెళుతోంది. ఈ కారణంగా హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్చి నడిచేందుకు కష్టతరంగా మారిందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయమై స్థానికులు అధికారులకు తెలిపినా పట్టించుకున్న పాపాన పోవడం లేదని రోడ్డుపై వెళుతున్న పాదచారులు వాపోతున్నారు. తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగు నీటి వృథా లేకుండా అధికారులు వెంటనే స్పందించి సుబ్రహ్మణ్యం ఇంటికి వెళుతున్న సంపు నుండి నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని స్థానికుల కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శి వివరణ

తాగునీరు వృథా విష యమై పంచాయతీ కార్యదర్శి సదా శివయ్యకు వివరించగా త్వరలోనే చర్యలు తీసుకుని హాస్టల్ విద్యార్థుల సమస్యను పరిష్కరి స్తా మని తెలిపారు.

హాస్టల్ భవనంలోకి ప్రవేశించి ఇబ్బందికరంగా మారిన వృథా తాగునీరు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండలంలోని మాధవ నగర్ వద్ద 1973– 74 సంవత్సరం 10వ తరగతి చదివిన విద్యార్థులు 50 సంవత్సరాల తర్వాత కలిసి ఒకరికొకరు క్షేమ సమాచారం అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల దామోదర్ గుప్తా, జోహార్ హుస్సేన్, ఉమాపతి, రవి, అనురాధ , చంద్రమ్మ, నాగేశ్వరరావు , పాల్గొన్నారు.

కరణం సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : మండలంలోని మొగిలి గ్రామంలో శ్రీ కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయంలో బంగారుపాలెం కరణం సంక్షేమ సంఘ క్యాలెండర్‌ను అధ్యక్షులు భాస్కర్ పిళ్లై ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు షణ్ముగం పిళ్లై మాట్లాడుతూ 2025 వార్షిక క్యాలెండర్లను ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని సంఘం ద్వారా ముద్రించిన పత్రికలు పంపిణీ చేపట్టేందుకు చేపడుతున్న కార్యవర్గ సభ్యులకు అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంఘం ద్వారానే అభివృద్ధి చెందుతారని ఒకరు చేపట్టని పనులను సంఘం చేపడుతుందని దాని వల్ల సంఘం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు తులసి కుమార్, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం పిళ్లై, సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి రవీంద్ర ప్రసాద్, కోశాధికారి సుబ్రహ్మణ్యం పిళ్లై, కమిటీ సభ్యులు శంకరన్ ,హరిహర ప్రసాద్, రవిచంద్ర ,గురునాథం, లోకేష్. రుక్కు మంద, లక్ష్మీనారాయణ, నాగేశ్వర లాల్ పలువురు కరణం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కరణం సంక్షేమ సంఘం సభ్యులు

గదుల డిపాజిట్ రిఫండ్‌పై విచారణ చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

గత వైసిపి ప్రభుత్వ హయాంలో 2022 నుండి తిరుమలకు వచ్చిన శ్రీవారి భక్తులకు, యాత్రికులకు గదుల కేటాయింపు జరిపే సమయంలో టీటీడీ వసూలు చేసే కాషన్ డిపాజిట్ రిఫండ్ పై భారీగా అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ జరిపించాలని జనసేన పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి కిరణ్ రాయల్ డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గదులు పొందిన వారికి నగదు వారి బ్యాంకు ఖాతాకే నేరుగా జమ చేసే విధంగా నిర్ణయం తీసుకున్నారని, కానీ చాలావరకు నగదు జమ కాకుండా భక్తులు విమర్శలు చేసిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఆనాడు దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రయత్నించగా తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. ఈ అవకతవకల నగదు మొత్తం మాజీ ముఖ్యమంత్రి జగన్ ఖాతాకు బదిలీ అయిందని ఆరోపించారు. ఈ కాషన్ డిపాజిట్ రీఫండ్ లో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని టిటిడి చైర్మన్ కు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సుమన్, మనోజ్ పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో బంజారా సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఈనెల 27, 28 తేదీలలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆడిటోరియంలో బంజారా జన్ సంఘ్ ఆధ్వర్యంలో గిరిజన జాతీయ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బంజారా జన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు మూడే హరి చౌహాన్ నాయక్ కోరారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఈ సాంస్కృతిక కార్యక్రమాల గోడ పత్రికలను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజ్ గౌడ్ తో కలసి ఆవిష్కరించారు. మొట్టమొదటిసారి తిరుమల శ్రీవారి పరమ భక్తుడైన హాథీరాం బావాజీ విశిష్టతను తెలియజేస్తూ రెండు రోజులపాటు పౌరాణిక సాంఘిక నాటికలు, ఆధ్యాత్మిక సంగీత సంకీర్తనాలాపనలు, జానపద నత్యాలు నిర్వహిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వెంకటేష్, వినోద్, రమేష్ బాబు, సీతారాం, కిషోర్ పాల్గొన్నారు.

షేక్ హాసినాకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్వీయూ సైన్స్ కళాశాల గణిత విభాగం పరిశోధక విద్యార్థి షేక్ హాసినాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గణిత విభాగాధ్యక్షులు ఆచార్య సి. జయసుబ్బారెడ్డి మార్గదర్శకత్వం లో " సమ్ స్టడీస్ ఆన్ (ఆల్ఫా, వన్) రివర్స్ డెరివేషన్స్ ఇన్ రింగ్స్ " అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. హసీనా పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు వెల్లడించారు.

తత్కాల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -రామచంద్రపురం

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ నందు పదవ తరగతి, ఇంటర్మీడియట్ లలో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటించిన తత్కాల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సంచాలకులు పలువురు చేసిన విజ్ఞప్తి మేరకు డిసెంబర్ 26వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు తత్కాల్ నందు గడువు ఇచ్చారని చెప్పారు. సాధారణ అడ్మిషన్ ఫీజుకు అదనంగా 600 రూపాయలు తత్కాల్ ఫీజుగా చెల్లించి ఓపెన్ స్కూల్ నందు ప్రవేశము పొందవచ్చున్నారు. 2024 –25 విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఇదే ఆఖరి అవకాశంగా తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రవేశాలను ఏపీ ఆన్లైన్ ద్వారా చేసుకోవచ్చున్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమాని ప్రాణాలు కాపాడుకున్నాం: కృష్ణ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తీవ్రమైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమాని కౌశిక్ ప్రాణాలు కాపాడడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని మాటిచ్చి ప్రాణాలు కాపాడామని జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కృష్ణ యాదవ్ అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాని కౌశిక్ క్యాన్సర్ వ్యాధితో తన కుమారుడు బాధపడుతున్నాడని, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితుల్ని తెలుసుకొని టీటీడీ నుండి 40 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం 11 లక్షలు, టిటిడి ఉద్యోగులు 10 లక్షల రూపాయల వరకు ఆపరేషన్ కు అవసరమైన నగదును సమకూర్చారన్నారు. అయితే వారి కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో చెన్నై ఆసుపత్రిలో వైద్యానికి సరిపడా నగదు చెల్లించకపోవడంతో ఆసుపత్రి యాజమాన్యం కౌశిక్ ను డిశ్చార్జి చేయలేదన్నారు. డిశ్చార్జ్ అయిన తర్వాత మందుల అవసరాలకు సరిపడా నగదు కోసం మీడియా ముందుకు కౌశిక్ తల్లి వచ్చిందని, ఎన్టీఆర్ అభిమానులు అందరూ కలిసి కౌశిక్ కు అవసరమైన మందులకు తగిన సహకారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం కన్వీనర్లు మురళి, వరదారెడ్డి, రాజేష్, నాని, జానకిరామ్, సోము, నందా పాల్గొన్నారు.

ముగిసిన బ్యూటీషియన్ శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో పది రోజుల బ్యూటీషియన్ శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక వెంకటపతినగర్ లోని మహిళలకు బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ టి.చైతన్య మాట్లాడుతూ ప్రస్తుతం ఎంతో ఆదరణ ఉన్న బ్యూటీషియన్ కోర్సు నందు నేర్చుకున్న స్కిల్స్‌ను తమ దైనందిన జీవితంలో కొనసాగిస్తూ ఉండాలని, ఈ వత్తిని ఉపాధిగా ఎంచుకున్న మహిళలు తమకు అనుకూలంగా ఉండే సమయంలోనే కొనసాగిస్తూ స్వయం ఉపాధి సాధించవచ్చని అన్నారు. బ్యూటీషియన్ లో స్కిల్స్ పూర్తిగా నేర్చుకుని ఇతరులకు ఉపాధి అవకాశాలు ఇచ్చే స్థాయికి ఎదిగిన వారు చాలామంది ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యూటీషియన్ ట్రైనర్ కే.నిరోష, అధ్యయనకేంద్ర ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఎం. ఇంద్రాణి పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : .ప్రపంచ మానవాళి శాంతిని కోరుకుంటూ జీసస్ క్రైస్ట్ తన ప్రాణాలను త్యాగం చేశారని చిత్తూరు నగరం లోని గిరింపేటలోని షకినా చర్చ్ పాస్టర్ జోబ్ తెలిపారు. బుధవారం స్థానిక చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిని ప్రత్యేకంగా ముస్తాబు చేసి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బైబిల్ వ్యాఖ్యలు చదివి క్రైస్తవ సోదరులకు వినిపించారు. కుల మతాలకు అతీతంగా హిందువులు, ముస్లింలు క్రైస్తవ సోదరులు అందరూ చర్చికి వెళ్లి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

కుప్పం : బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్ తరపున షాలోమ్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి నాగరాజు మాట్లాడుతూ మొదట ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పేద ఉత్తమ విద్యార్థులకు తమ ట్రస్ట్ తరపున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. అనంతరం నిరుపేద క్రైస్తవులకు ట్రస్ట్ తరపున నిత్యావసర వస్తువులు అందించారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలంలోని బిసి కాలనీ లో భేతల్ షారోన్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మంగళవారం ఈ కార్యక్ర మానికి గంగాధర నెల్లూరు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొన్న యుగంధర్, వెదురుకుప్పం కార్యకర్తలు పాల్గొన్నారు. చర్చి నిర్వాహకులు వెదురుకుప్పం మండలం పాత గుంట గ్రామానికి చెందిన ఆర్కాడు యతీశ్వర్ రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. ప్రస్తుతం ఈయన గంగాధర నెల్లూరు నియోజకవర్గం బూత్ కన్వీనర్‌గా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జనసైనికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచర్ల : క్రిస్మస్ సందర్భంగా రొంపిచర్ల లోని గ్రేస్ ప్రేయర్ చర్చిలో పాస్టర్ కె శ్యాముయేల్ ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధనలు విని అందరూ శాంతి మార్గంలో ఉండాలని ప్రార్థనలు చేశారు. పాటలతో ఘనంగా నిర్వహించారు.

పుంగనూరు: పట్టణంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో బుధవారం వేకువ జామున నుండే ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. విద్యుత్ అలంకరణలతో ప్రత్యేక ఆకర్షణగా చర్చిలు నిలిచాయి. పట్టణంలోని సీఎస్ఐ చర్చ్, ఎంపీటీ రోడ్డులో ఉన్న క్యాథలిక్ చర్చ్, మార్ల పల్లె వద్ద ఉన్న చర్చి, డాన్ బోస్కో స్కూల్ ఉన్న చర్చిల్లో ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి పుంగనూరు పట్టణంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

కార్వేటినగరం: ప్రపంచ శాంతికి క్రీస్తు మార్గం అనుసరణీయమని వైసిపి మండల మాజీ కన్వీనర్ ధనంజయవర్మ అన్నారు. ప్రిన్సిసెస్ చర్చిలో ఎంపీపీ లతాబాలాజీ అందించిన 40 కేజీల భారీ కేకున్ చర్చిపాస్టర్ ఆధ్వర్యంలో కట్ చేసి సంబరాలు నిర్వహించారు. బేతేలరోన్ చర్చిలోనూ క్రిస్మస్ వేడుకలను పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ లతా బాలాజీ అందించిన 30 కేజీల భారీ కేక్ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పొన్నయుగంధర్ హాజరయ్యారు. ఈ క్రమంలో బాగంగా ఎంపీపీ లతాబాలాజీ మండల కేంద్రంలోని పలు చర్చిలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిడి నెల్లూరు నియోజకవర్గం జనసేన భూత్ కన్వీనర్ యతేశ్వర్ రెడ్డి, పాస్టర్లు హరిబాబు, బాబు ఆయా చర్చిపాస్టర్లు పలువురు పాల్గొన్నారు.


కార్వేటినగరంలో

సోమల: ఏసుప్రభు జన్మదినం సందర్భంగా మండలంలో క్రిస్మస్ వేడుకలను క్రిస్టియన్ సోదరులు ఘనంగా నిర్వహించారు. సోమల, పెద్ద ఉప్పరపల్లి, నంజంపేట, కందూరు, మేటి మంద గ్రామాలలోని చర్చిలలో ప్రార్థనలు నిర్వహించి కేకులు కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

రామకుప్పం: క్రిస్మస్ పండుగ వేడుకలు రామకుప్పం మండలంలో ఘనంగా నిర్వహించారు. బల్ల, గెరిగపల్లి, వీర్నమల, రామకుప్పంలోని ఆర్ సి ఎం చర్చ్ , హోలీ ఫ్యామిలీ చర్చ్ లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పిల్లలకు ఆట పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

ఎస్ఆర్ పురంలో

ఎస్ఆర్ పురం : నియోజకవర్గంలోని ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట కు వైసిపి గంగాధర నెల్లూరు నియోజకవర్గ నాయకురాలు కృపా లక్ష్మి హాజరయ్యారు బుధవారం క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని వైసిపి యువ నాయకుడు సాము ఆహ్వానించాడు. ఆయన ఆహ్వానాన్ని స్వీకరించి ఆమె కార్యకర్తలతో కలిసి వారి కార్యకర్త ఇంటికి వెళ్లారు. క్రిస్మస్ వేడుకలలో కార్యకర్తల వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపారు. ఆమెను సాము కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిగత కార్యదర్శి సుబ్రహ్మణ్యం స్థానిక సర్పంచ్ డివి డిల్లయ్య మండల పార్టీ అధ్యక్షుడు మణి ఎసురత్నం జనార్ధన్ దొరస్వామి టీచర్ కటికపల్లి మణి ,గోవిందరెడ్డి , స్టైలా, నీలమ్మ, కోటిరెడ్డి బాబు ,ఆబురు , శేషాద్రి, ఆదిశయ రాజు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి టిడిపి నాయకులతో కలిసి పలుచోట్ల పాల్గొన్నారు. పట్టణంలోని ఏటీఎమ్ సర్కిల్ లోని సీఎస్ఐ చర్చి, గుడియాత్తం రోడ్డులోని నూతన సీఎస్ఐ చర్చ్ మరియు శ్రీనగర్ కాలనీలోని క్రిస్టియన్ అసెంబ్లీ చర్చ్ లలో జరిగిన క్రిస్మస్ ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన సీఎస్ఐ చర్చి నందు మొక్కలను నాటారు. క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలో పేదలకు బెడ్ షీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాలెం: మండలంలోని పలు చర్చల్లో క్రిస్మస్ సోదరులు భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు మంగళవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేసి బుధవారం ఉదయం ఒకరికి ఒకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముంగరమడుగు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు యోహాన్ పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

రిటైర్డ్ ఆర్అండ్‌బి గ్యాంగ్ మెన్ మృతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని గంగాధర నెల్లూరు దళితవాడకు చెందిన రిటైర్డ్ ఆర్అండ్‌బి గ్యాంగ్ మెన్ చెంగల్‌రాయులు అనారోగ్య కారణంగా బుధవారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు వున్నారు. గత 20 రోజుల క్రితం ఇతని పెద్ద కుమారుడు, జూనియర్ అసిస్టెంట్ శ్రీబాబు గుండె పోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వాళ్ల నాన్న చెంగల్ రాయులు మృతి చెందాడు. ఇతని కుమారుడు నీరజాక్షులు టీవీ 9లో రిపోర్టర్ గా ఉన్నాడు. గతంలో ఇతను ప్రజాశక్తి రిపోర్టర్‌గా పని చేశాడు. 20 రోజుల క్రితం నీరజాక్షులుకి అన్న, ఇప్పుడు తండ్రి మృతి చెందడంతో ఆ దళితవాడలో విషాదఛాయలు అలుము కున్నాయి.


చెంగల్‌రాయులు

అన్నమయ్య ఘటనపై... పలు కోణాల్లో దర్యాప్తు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాయలచెరువు రోడ్డు కూడలిలో అన్నమయ్య విగ్రహానికి శాంతాక్లాజ్ టోపీ పెట్టిన ఘటనపై ఎంఆర్‌పల్లి పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు ఈస్టు పోలీసు స్టేషన్‌లోని సిసి కెమెరాల ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనకు పాల్పడింది బిక్షగాడని పోలీసులు మంగళవారమే తేల్చారు. అన్నమయ్య సర్కిల్లో సిగ్నల్ పడినపుడు వాహనాల వద్ద పెన్నులు, చెవి బడ్స్ అమ్ముకునే వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఈ ఘటన పైన హిందూ సంఘాలు, స్వామీజీలు, బజరంగ్ దళ్ కార్యకర్తలు తీవ్ర ఆందోళనకు దిగి తిరుమల శ్రీవారి పరమ భక్తుడైన అన్నమయ్య విగ్రహానికి ఇలా శాంతాక్లాజ్ టోపీ పెట్టి అపచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లౌకికవాదులైతే తిరుమల తిరుపతి వేదికగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని హితవు పలికారు. రంగంలోకి దిగిన పోలీసులు అసలు అక్కడ ఏం జరిగింది అన్నది సిసిటివి ఫుటేజ్ ను పరిశీలించారు.


సిసి కెమెరా దృశ్యం

అన్ని కోణాల్లోనూ దర్యాప్తు

అతడు తెలిసీ తెలియక శాంతాక్లాజ్ టోపీ అన్నమయ్యకు పెట్టాడా లేక, పెట్టడానికి ఎవరైనా అతనిని ప్రోత్సహించారా అన్న కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంలో ఎవరు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని, ఇదే సమయంలో పురప్రజలు సంయమనం పాటించాలని సూచిస్తున్నారు. క్రిస్మస్ పండుగకు ముందు రోజు జరిగిన ఈ ఘటన నేపథ్యంలో మత విద్వేషాలు రగలకుండా తిరుపతిలో పోలీసులు చర్యలు తీసుకున్నారు.

చెన్నయ్ ఎస్ఆర్ఎంకు 'యువతరంగ్' జట్టు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ విద్యార్థి సంక్షేమ, సాంస్కతిక సంబంధాల విభాగం (డిఎస్డబ్ల్యూసిఏ) నేతత్వంలో చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం నందు దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల సాంస్కతిక కార్యక్రమాల పోటీలో పాల్గొనేందుకు యువతరంగ్ జట్టు పయనమయ్యింది. ఈ సాంస్కతిక పోటీలో పాల్గొనేందుకు వర్సిటీ యువతరంగ్ 2024 నందు అద్భుత ప్రదర్శన చేసిన యువ కళాకారుల బందం బుధవారం మధ్యాహ్నం చెన్నైకి బయలుదేరి వెళ్ళింది. ఆ సాంస్కతిక పోటీలన్నింటిలో ఎస్వీయూ పాల్గొననుంది. వర్సిటీ ఇన్చార్జ్ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు శుభాకాంక్షలు తెలుపుతూ, పోటీలలో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. డిఎస్డబ్ల్యుసిఎ డైరెక్టర్ ఆచార్య బివి మురళీధర్ మాట్లాడుతూ ఎస్వీయూ విద్యార్థులు నూతన ఉత్తేజంతో ఈ పోటీలలో పాల్గొనేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారని వెల్లడించారు. గత 15 రోజులుగా వర్సిటీలోని అన్నమయ్య భవన్లో విద్యార్థులు నిపుణులైన శిక్షకుల ద్వారా ప్రాక్టీస్ చేశారని అన్నారు. చెన్నైలో జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో విద్యార్థులు కచ్చితంగా విజయం సాధించి, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తనకు పూర్తిగా నమ్మకంలోని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎస్డబ్ల్యుసిఏ కో ఆర్డినేటర్ డా. పత్తిపాటి వివేక్ చౌదరి పాల్గొన్నారు.

చంద్రయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఇసుక కోసం స్వర్ణముఖి నదిలోకి దిగిన ఎడ్ల బండి నీటి ప్రవాహానికి కొట్టుకుపోగా, ఓ ఎద్దు ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన మంగళవారం శ్రీకాళహస్తి రూరల్ మండలం పరిధిలోని బూరగమానుకండ్రిగ వద్ద చోటు చేసుకుంది. బాధితుడు చంద్రయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. వివరాల్లోకి పోతే..శ్రీకాళహస్తి పట్టణంలోని ఏఎంపుత్తూరుకు చెందిన కళత్తూరు చంద్రయ్యది నిరుపేద కుటుంబం. ఎడ్ల బండి సాయంతో కూలీనాలీ పనులు చేసుకుంటూ రోజువారీ కూలీగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బూరగమానుకండ్రిగ వద్ద ఉన్న స్వర్ణముఖి నది నుంచి ఇసుకను తీసుకొచ్చేందుకు డిగ్రీ చదువుతున్న కుమారుడు మునిబాలాజీతో కలిసి వెళ్ళాడు. నదిలోని ఇసుక మేట వద్దకు చేరుకునే క్రమంలో నీటి ప్రవాహాన్ని అంచనా వేయక ఉదటికి ఎడ్ల బండి కొట్టుకుపోయింది. ప్రవాహ వేగానికి ఎడ్ల బండి ఫల్టీలు కొట్టడంతో కాడెకు ఉన్న ఎద్దుల్లో ఒకటి మరణించింది. తండ్రీ కొడుకులకు ఈత రావడంతో ప్రాణాలతో ఒడ్డుకు చేరారు. స్థానికుల సాయంతో బండిని కూడా ఒడ్డుకు చేర్చారు. తమ ఉపాధికి జీవనాధారమైన ఎద్దును కోల్పోవడంతో నది వద్ద చంద్రయ్య కన్నీరుమున్నీరై విలపించడం అందర్నీ కలచి వేసింది.

ప్రభుత్వం ఆదుకోవాలి: అంగేరి పుల్లయ్య

ఇసుక కోసం వెళ్లి జీవనాధారమైన ఎద్దును కోల్పోయిన చంద్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య కోరారు. కాడెద్దుల విలువ రూ. 1.20 లక్షలు కాగా మరో ఎద్దును కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత చంద్రయ్య వద్ద లేదన్నారు. చంద్రయ్య లాగే మరో వంద కుటుంబాల వరకు పట్టణంలో ఎడ్ల బండ్లను నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. వర్షాలు, నదిలో నీటి ప్రవాహం తగ్గే వరకు వారికి ఇల్లు గడవడం కష్టతరమవుతుందన్నారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం భతి కల్పించాలని కోరారు.

బిజెపి మండల అధ్యక్షుల ఎన్నిక

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండల బిజెపి అధ్యక్షుడిగా జల్లా జ్యోతి రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బిజెపి రిటర్నింగ్ అధికారి జీకే చౌదరి బుధవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో జల్లా జ్యోతి రెడ్డిని నూతన మండల అధ్యక్షులుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల బూత్ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిపల్లి: గుడిపల్లి మండల అధ్యక్షుడిగా రామచంద్రుడుని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా నాయకులు గజేంద్ర, సతీష్ కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తులసినాథ్ పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మండల బీజేపీ అధ్యక్షుడుగా ఆగరమంగళం గ్రామానికి చెందిన ఆనంద్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బీజేపీ ఎన్నికల పరిశీలకులు యువరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు మణివర్మ, రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు సుధాకర్ , జిల్లా ప్రధానకార్యదర్శి జి.కె. నాయుడు, మాజీ మండల బీజేపీ అధ్యక్షులు మురళి, తదితరులు పాల్గొన్నారు.

సోమల: సోమల మండల బిజెపి మండల అధ్యక్షులుగా ముత్యాల హేమగిరిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రిటర్నింగ్ అధికారి వెంకటప్రసాద్ , నియోజకవర్గ ఇన్‌ఛార్జి గన్న మదన్మోహన్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగాయి.

క్రైం న్యూస్

సాగునీటి సంఘం అధ్యక్షులు మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

వడమాలపేట మండలం కల్లూరు చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు రఘురామయ్య. వ్యవసాయ పొలం వద్ద. మోటర్ వేయడానికి వెళ్లి. కరెంట్ షాక్‌తో మృతి చెందారు. పొలం వద్ద మోటార్ వేయడానికి వెళ్లి కరెంటు షాక్ కు గురై అక్కడికక్కడే మరణించారు. ఆయన. మృతి పట్ల నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సంతాపం ప్రకటించారు.

నేటి నుండి రైతుల ప్రత్యేక ఐడి కోసం ఆన్‌లైన్ సేవలు

మండల వ్యవసాయ అధికారి ఎన్ హరిప్రసాద్

ప్రజా శక్తి - సదుం : డిసెంబర్ 26 నుండి మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రైతులకు ప్రత్యేక ఐడి కోసం ఆన్‌లైను సేవలు అందుబాటులో ఉంటాయని మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. భారత ప్రభుత్వం రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఐడి నెంబర్) ఇవ్వాలని నిర్ణయించిన మేరకు.. పుంగనూరు డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి శివకుమార్ ఆదేశాల మేరకు..మండల పరిధిలోని రైతులు అందరూ రైతులకు సంబంధించిన ఆధార్ కార్డు, భూమి వివరాలు కలిగిన 1బి, ఆధార్ లింక్ చేసిన మొబైల్ నెంబర్ తో రైతులు రైతు సేవా కేంద్రాల కు వెళ్లి ఆన్లైన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్.హరి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

వెదురుకుప్పంలో నాకా బందీ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు వెదురు కుప్పంలో బుధవారం నాకా బంద్ నిర్వహించారు. మండలంలోని పచ్చికా పల్లం, వెదురు కుప్పం ఆర్అండ్‌బి రోడ్డులో ఎస్ఐ వెంకటసుబ్బయ్య తమ సిబ్బందితో కలిసి పలు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలిస్తున్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలు, ముగ్గురు వెళ్లిన ద్విచక్ర వాహనాలకు జరిమానా విధిస్తామని ఎస్ఐ వాహనదారులను హెచ్చరించారు. ఈ తనిఖీలో కానిస్టేబుళ్లు కళ్యాణ్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య

సభ్యత్వ నమోదు వేగవంతం: టిడిపి

సభ్యత్వ నమోదులో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని, పాత గుంట పంచాయ తీలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశాల మేరకు యువ నాయకులు లోకనాథ రెడ్డి ఆధ్వర్యంలో, టిడిపి సభ్యత్వ నమోదు వేగవంతం చేశామని బుధవారం సభ్యత్వాలు ఆఖరి రోజు కావడంతో మంగళవారం పెద్ద ఎత్తున టిడిపి సభ్యత్వాలు చేశామని జిల్లా యువత వైస్ ప్రసిడెంట్ చంద్రబాబు రెడ్డి పేర్కొన్నారు. సుమారు 500 మంది ఆ పంచాయతీలో టిడిపి సభ్యత్వ నమోదు తీసుకున్నట్లు కార్యకర్తలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు తిమ్మరాజులు, ఉప సర్పంచ్ గురుమూర్తి రెడ్డి, తిరుపాల్ రెడ్డి, జీవ, వేంకటాద్రి, శివ, పాల్గొన్నారు.

తిరుపతిలో ఎస్ఎస్‌డి టైంస్లాట్ కౌంటర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - తిరుమల: తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనాల ఎస్ఎస్‌డి టైం స్లాట్ టోకెన్లు జారీ కౌంటర్లను టిటిడి ఈవో శ్యామలరావు, కలెక్టర్ ఎన్. వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు పరిశీలించారు. జనవరి 10–19 తేదీలోల వైకుంఠ ద్వార దర్శనాలను కల్పించనున్నారు. జనవరి 8వ తేదీ ఉదయం 6 గంటల నుంచి టోకెన్ల జారీ ప్రక్రియను ప్రారంభిస్తారు. 10–12 తేదీల్లో లక్షా 20వేల టోకెన్లు జారీ చేస్తారు. మిగిలిన ఏడు రోజులకు ముందు రోజు మాత్రమే రెగ్యులర్ ఎస్ఎస్‌డి టైంస్లాట్ టోకొన్లు జారీ చేయనున్నారు. టోకెన్ల జారీకి తిరుపతి, తిరుమలలో 9 కేంద్రాల్లో91 కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. గోవిందమాల భక్తులకు ఎటువంటి ప్రత్యేక టికెట్లను జారీ చేయడం లేదని ఈవో శ్యామలరావు తెలిపారు.

టీటీడీకి రూ.1.11 కోట్లు విరాళం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఈఓ పి.ఎం.ఎస్.ప్రసాద్ బుధవారం టీటీడీ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఒక కోటి పదకొండు లక్షల పదకొండు వేల నూట పదకొండు రూపాయలను విరాళంగా అందించారు. ఈ మేరకు విరాళం డీడీని శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

సిఎం దృష్టికి పరకామణి ఉద్యోగి స్కాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం:

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల శ్రీవారి ఆలయ పరకామణిలో 2023లో విధులు నిర్వహించిన రవికుమార్ అనే వ్యక్తి భక్తులు సమర్పించే కానుకలను కాజేసిన కేసు విషయంలో కోట్ల రూపాయలు చేతులు మారాయని, లోక్ అదాలత్‌లో ఈ కేసును రద్దు చేసుకునేలా ఆనాటి టిటిడి ఉన్నతాధికారులు, గత ప్రభుత్వ పెద్దలు వ్యవహరించారని టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. ఈ కుంభకోణంపై సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతానన్నారు. బుధవారం తిరుపతి–కరకంబాడి మార్గంలోని మంగళం పోలీస్ అవుట్ పోస్టు సమీపంలో ఉన్న పసుపర్తి పనోరమ అపార్ట్మెంట్లో రవికుమార్ కొని టీటీడీకి గిఫ్ట్ డిడ్ కింద రాసిచ్చిన 14 ఫ్లాట్ లను భాను ప్రకాష్ రెడ్డి సందర్శించి విలేకరులతో మాట్లాడారు. ఈ పరకామణి డాలర్ల దొంగతనం కేసు వెనుక గత ప్రభుత్వ పెద్దలు ఉన్నారని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ కమిటీ ఏర్పాటు చేసి నిజాలు శ్రీవారి భక్తులకు తెలిసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానన్నారు.

రేపు వాలీబాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ :

ఏపీ క్రీడా అధికార సంస్థ ఆధ్వర్యంలో వాలీబాల్ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, స్త్రీల జట్ల ఎంపికను ఈనెల 27వ తేదీన విజయవాడలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివద్ధికారి సయ్యద్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 27వ తేదీ ఉదయం ఏడు గంటలకు తమ ధృవీకరణ పత్రాలతో, 10 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన రాష్ట్ర జట్టు జనవరి 7వ తేదీ నుండి 13వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ లో జరుగు జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

వాజ్ పేయికి ఘన నివాళి

ప్రజాశక్తి- గుడిపాల: అటల్ బిహారీ వాజ్ పాయ్ జయంతి వేడుకలు బిజెపి ఆధ్వర్యంలో గుడిపాల మండలంలోని బొమ్మసముద్రం క్రాస్ రోడ్‌లో జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు చిట్టిబాబు, సోమనాథ్ గౌడ్ , సాయి ప్రతాప్, దేవరాజ్, శేఖర్ , పెరుమాళ్ , శివాజీ , సుభాష్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: భారత మాజీ ప్రధానమంత్రి వాజ్ పాయి శత జయంతి వేడుకలు బుధవారం గాంధీ విగ్రహం ఎదుట బీజేపీ చిత్తూరు సెంట్రల్ మండల అధ్యక్షులు షణ్ముగం ఆధ్వర్యంలో నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు దుర్గారామకృష్ణ, ఆ పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.